


# హైదరాబాద్ వార్త

# టిక్..టిక్..టిక్..!

- -మిగిలింది మరికొన్ని గంటలే
- -నేటి సాయంత్రం 5గంటలకు ముగియనున్న ప్రచార పర్వం
- -పోలింగ్ సమీపిస్తుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్
- -ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు
- -పలుకాలనీలు, బస్తీలల్లో ఇప్పటికే డబ్బుల పంపిణీ షురూ
- -ప్రలోభాలను అరికట్టేందుకు ఎన్నికల అధికారుల యత్నం



**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి మరికొన్ని గంటల్లో తెరపడనుంది. నేటి సాయంత్రం 5గంటల తర్వాత అభ్యర్థుల ప్రచారం ముగుస్తుంది. దీంతో పోలింగ్ దగ్గరపడుతున్నా కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతుంది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మద్యం, మనీతో ప్రలోభాలకు దిగుతున్నారు. ఇప్పటికే బస్తీలు, కాలనీల్లో ఎక్కడికక్కడ కింది స్థాయి నాయ కులతో డబ్బు పంపిణీ ప్రారంభించారు. ఒక పార్టీ 3వేలు ఇస్తే మరోపార్టీ 2నుంచి 3వేలు ఇస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈనియోజకవర్గంలో ఆరున్నర డివిజన్‌లు ఉన్నాయి. ప్రధానంగా యూసఫ్‌గూడ్, బోరబండ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, షేక్‌పేట్, వెంగళ్‌రావు నగర్‌లు ఉండగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని సోమాజిగూడ డివిజన్‌లో గల ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్ కాలనీలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉంటాయి. దీంతో కాంగ్రెస్–బిఆర్‌ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే అంతేకాకుండా నేటి సాయంత్రం నుంచి పోలింగ్ రోజువరకు మద్య దుకాణాలు మూసి ఉంటాయి. దీంతో ముందస్తు వ్యూహాంతో భారీస్థాయిలో మద్యం నిలువలు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నిల అధికారులు, పోలీసు యంత్రాంగం పటిష్ట నిఘా ఏర్పాటు చేసినా.. యంత్రాంగం కళ్లుగప్పి తమపని తాము చేసుకు పోవడానికి అభ్యర్థులు రెడీ అవుతున్నట్లు సమాచారం. అయితే పార్టీల అధిష్టానాల వ్యూ హాలు ఎలా ఉన్నప్పటికీ స్థానిక నియోజకవ ర్గాల్లో పోటీచేసే అభ్యర్థులు మాత్రం తమ గెలుపుపైనే ప్రధాన దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఎదుటి పార్టీల అభ్యర్థుల బలా బలాలు, బలహీనతలు వారిపై స్థానికంగా ఉన్న అసంతృప్తితోపాటు వారికి వ్యతిరేఖంగా పనిచేసే నాయకులు తదితర అంశాలపై తమ కు నమ్మకంగా ఉండే వ్యక్తులతో సమాచారం సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా తాము ఎవరితో సంప్రదింపులు జరిపితే ప్రత్యర్థికి వ్యతిరేఖంగా ఉన్నఓట్లు తమకు అనుకూలంగా మారుతాయనే కోణంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈనేపథ్యంలో అభ్యర్థులు నమ్మిన వ్యక్తులతో పాటు ఇతర అభ్యర్థులకు వ్యతిరేఖంగా పనిచేసే వారితో నిత్యం రహస్య మంత నాలు జరుపుతున్నారు. అలాగే ఓటింగ్‌కు మరో 48గంటలే ఉండటంతో తెర వెనుక ఎత్తులకు నేతలు పదునుపెట్టారు. తమవి కావు అనుకున్న ఓట్లను టార్గెట్ చేసి కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజల ఓట్లను లక్ష్యంగా చేసుకుని వారు నివాసముండే బస్తీలు, కాలనీ ల్లో పెద్దఎత్తున ప్రలోభాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారి అడ్రస్ సేకరించి పోలింగ్ కేంద్రాల వారీగా ఇంఛార్జుల ను, 100 మందికి ఓ ఇంఛార్జీని పార్టీలు నియ మించుకున్న విషయం విదితమే. వీరిలో కనీ సం 3 లక్షల మందికి బహుమతులు లేదా నగదును అందజేయాలనే లక్ష్యంతో కొంతమం ది పని చేస్తున్నారు.

**అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్**

ఈనెల 11న పోలింగ్ జరుగనుండటంతో ఆయా పార్టీల నుంచి ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. కంటిమీద కునుకులేకుండా ప్రచారం సాగిస్తున్నారు. పార్టీల పరంగా వారివారి మెనిపెస్టోతో హామీలు ఇస్తున్నప్పటికీ స్థానికంగా అభ్యర్థులు సైతం తాము గెలిస్తే పాలన వర్గాలకు, పాలన వారికి పనులు చేసిపెడతామంటూ హామీలు ఇస్తున్నారు. ఎన్నికలంటే ముందు రెండుమూడు రోజులే కీలకం కావడంతో ప్రత్యర్థులు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నారనే దానిపై ఆరాతీస్తున్నారు. పొద్దంతా ప్రచారం చేస్తూనే రాత్రులు, అర్ధరాత్రుల సమయంలో రహస్య మంతనాలు జరుపుతున్నారు. ముఖ్యంగా మహిళలు, యువకులను మచ్చిక చేసుకోవడంతో పాటు ఆయా కులసంఘాలు, ఉగ్యోగసంఘాలు, వివిధ బస్తీల నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. తాము గెలిస్తే అన్నివిధాల సహకరిస్తామని తమకాలనీని అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తామని హామీలిస్తున్నారు.

# చెత్త తరలింపులో నిర్లక్ష్యం

**-వాహనదారులకు ప్రాణ సంకటం -చెత్త ఆటో నుంచి పరుపు పడి ఆస్పత్రి పాలైన వాహనదారుడు**



చెత్త ఆటో నుంచి కింద పడిన పరుపును తొలగిసున్తున్న స్థానికులు దృశ్యం.



ప్రమాదానికి కారణమైన చెత్త సేకరించే ఆటో దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి చెత్త తరలింపులో ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. చెత్త తరలింపులో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం నగరంలో చెత్త తరలించే వాహనం నుంచి వస్తువులు కింద పడి ఒక కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన సంఘటన మరిచిపోక ముందే ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెత్త ఆటో నుంచి పరుపు వాహనదారులపై పడి పలువురు గాయాలకు గురైయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ మెట్రో స్టేషన్ జిహెచ్ఎంసి చెత్త డంపింగ్ పాయింట్ ఉంది. ఇక్కడికి హయత్‌నగర్, ఎల్‌బినగర్, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన చెత్తను ఆటోల ద్వారా సేకరించి తీసుకుని వచ్చి వేస్తారు. దీనిని ఆక్కడి నుంచి భారీ వాహనాల ద్వారా జవహర్‌నగర్‌కు తరలిస్తారు. ఉప్పల్ సర్కిల్‌కు చెందిన చెత్త వేసేందుకు దేవేందర్‌నగర్‌లో చెత్త డంపింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. కాప్రా సర్కిల్‌కు చెందిన చెత్తను వేసేందుకు సాకేత్, మల్లాపూర్‌లలో చెత్త పాయింట్‌లు ఏర్పాటు చేశారు. దీనికి అధనంగా హయత్‌నగర్, హస్తినపురంలలో కూడా చిన్న డంపింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ నుంచి అన్ని ఆటోలు నాగోల్ మెట్రో స్టేషన్ పాయింట్‌కు చెత్తను తీసుకుని వస్తారు. కాగా చెత్త తరలించే వాహనాలు నిత్యం ఇక్కడి రావడంతో వల్ల రోడ్లపై రద్దీ నెలకొంటుంది. ఇదే క్రమంలో పలుస్లారు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నాగోల్ చెత్త పాయింట్ వద్ద చెత్త ఆటోల కారణంగా దుర్వాసనతోపాటు, ఆటో డ్రైవర్లు రోడ్లపై నిలిపి ఉంచుతున్నారు.



చెత్త ఆటో నుంచి పరుపు కింద పడి గాయాలకు గురైన వాహనదారుడు రాజేంద్రప్రసాద్ దృశ్యం.

**చెత్త తరలింపులో నిర్లక్ష్యం :**

నగరంలోని పలు ప్రాంతాల నుంచి చెత్తను తరలించే ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. చెత్త తరలించే సమయంలో విధిగా చెత్తపై కవర్లు కప్పి తీసుకుని రావాలి. కాని డ్రైవర్లు దీనిని పాటించడం లేదు. చెత్త వాహనం వెనుక వచ్చే వాహనదారులపై చెత్త పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈనెల 5వ తేదిన ఉదయం ఎల్‌బినగర్ నుంచి ఈసిఐఎల్ వైపు వస్తున్న ఒక కంపెనీలో పనిచేసే రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి బైక్ పై వస్తుండగా చెత్త ఆటో నుంచి పరుపులు కింద పడి అతనిపై పడ్డాయి. దీంతో అతను తీవ్ర గాయాలకు గురైయ్యారు. స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హెల్మెట్ ఉండడంతో ప్రాణాలు దక్కాయి. దీనిపై ఆయన ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. ఇదే విధంగా పలుమార్లు చెత్త ఆటోల నుంచి వస్తువులు వాహనదారులపై పడిన సంఘటనలు ఉన్నాయి. చెత్త సేకరించి సమయంలో అధికారులు వారికి జాగ్రత్తల విష యంపై సరైన సూచనలు ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**చెత్త తరలించే డ్రైవర్లకు లైసెన్స్‌లు అక్కర్లలేదా..?**

జిహెచ్ఎంసి పరిధిలో ఇళ్ల నుంచి చెత్త సేకరించి ఆటో, డిసిఎం డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకుండానే వాహనాలు నడిపిస్తున్నారు. వాహనం పొందిన వ్యక్తి లేకున్నా ఇతరులకు వాటిని ఇచ్చి రోడ్లపైకి పంపిస్తున్నారు. చెత్త సేకరించే సమయంలో చెత్త వాహనం డ్రైవర్‌తోపాటు, మహిళలు కూడా వాహనాలు నడిపిస్తున్నారు. కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో ఉంటున్నారు. రోడ్లపై చెత్త పడిన సమయంలో ప్రశ్నించిన స్థానికులపై కూడా వారు గొడవలకు దిగుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. చెత్త తరలించే పని కష్టంతో కూడికుని ఉండడంతో వారిపై కొంత జాలితో ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా ఇతరుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకం

**- హైదరాబాద్ సిపి వీసీ సజ్జనార్**



సిఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్

**చార్మినార్, నవంబరు 8 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగ సిబ్బంది పాత్ర కీలకమైనదని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. పోలీస్ శాఖలో పని చేసే ప్రతీ ఒక్కరూ ఎంతో క్రమ శిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌పాతబస్తీ పెట్లాబూర్జులోని సిఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం జరిగిన సెరిమెనియల్ పరేడ్ కార్యక్రమంలో హైదరాబాద్ సిపి సజ్జనర్ పాల్గొన్నారు. సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగాసీపీ సజ్జనర్ మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర గల సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి మంచి పేరు ఉందని, సిబ్బంది నిబద్ధత, అంకిత భావతంతో పని చేస్తున్నారని కొనియాడారు. ఇతర ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ శాఖ ఉద్యోగం భిన్నంగా ఉంటుందని ఆయన తెలిపారు. కుటుంబానికి ప్రాధాన్యమిస్తూ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతీ రోజు తప్పకుండ వ్యాయాయం చేయాలని ఆయన కోరారు. కాగా ఏఆర్‌కు చెందిన 1044 మంది పరేడ్‌ను నిర్వహించారు. అందులో సిటీ సెక్యూరిటీ గార్డు, స్వాఫ్ట్, క్విక్ రియాక్షన్ టీమ్, సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు తదితర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. సిఏఆర్ ప్రాంగాణాన్ని ఆయన సందర్శించారు. క్రెచ్, ఆర్మ్స్ అండ్ అమ్మునిషన్ స్టోర్ రూమ్, ఆర్మ్స్ వర్క్ షాప్, బ్యారక్ తదితర విభాగాలను క్షుణంగా ఆయన పరిశీలించారు. అనంతరం సిఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మెరుగైన పోలీసింగ్ కొరకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, అడిషనల్ డిసిపిలు ఎన్. భాస్కర్, బి. కిష్టయ్య, టి. కరుణాకర్, డి. సంజీవ్‌రెడ్డితో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల పరిసరాల్లో వీధి కుక్కల తొలగింపు



**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త:** ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయా లు, రవాణా కేంద్రాలు వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలన్న సూచనలపై గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్ వి కర్ణన్ సత్వరమే స్పందించారు. ఈనేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం ప్రారంభించింది. డ్రైవ్ మొదటి రోజైన శనివారం మొత్తం 277 వీధి కుక్కలను పట్టుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) అనంతరం ఈ కుక్కలను ఆసుపత్రుల ప్రాంగణాల్లో తిరిగి వదలకుండావాటిని జీహె చ్ఎంసీకి చెందిన జంతు సంరక్షణ కేంద్రాలకు తరలించారు. అక్కడ వాటికి శస్త్రచికిత్స, టీకాలు, సంరక్షణ, పర్యవేక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. జీహెచ్ఎంసీ తొలుత ప్రభు త్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రారంభించి, తరు వాత పాఠశాలలు, కళాశాలలు, రవాణా కేంద్రాలు వంటి ఇతర పబ్లిక్ ప్లేస్ లకు వరకు విస్తరించనున్నట్లు స్పష్టం చేసింది.

## 15న 'ఫీజు పోరు' పేరిట సమావేశం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ తదితరులు

**సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** రెండేళ్ళ కాంగ్రెస్ పార్టీ పాలనలో విద్యార్థుల ఫీజుల రీయంబర్స్‌మెంట్‌కు కేటాయించింది ఎంత, కా ంట్రాక్టర్లకు కేటాయించిన బిల్లులు ఎంత? విడుదల చేశారో తెలియజేస్తూ ప్రభుత్వం శ్వేత పత్రంను విడుదల చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంపద సృష్టించాలేగాని, నిధులు లేవని చేతులు ఎత్తివేస్తే ఏలా ? ఆయన ప్రశ్నించారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'ఫీజు పోరు' పేరిట ఈ నెల 15వ తేదీన అఖిల పక్ష పార్టీల, విద్యార్థి సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను ప్రభుత్వం బెదిరించి, భయపెట్టి కళాశాలలను తెరిపించిందని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు అన్యాయం చేసినా ఏ పార్టీ అయిన ఒక్కటేనని, బిఆర్‌ఎస్ కంటే మెరుగ్గా పాలన అందిస్తారనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారని, గత బిఆర్‌ఎస్ పాలనలో విద్యార్థుల ఫీజలు బకాయిలు, కాంగ్రెస్ పార్టీ రెండేళ్ళ పాలనలో ఉన్న బకాయిలు ఎన్ని ఉన్నాయో తెలియజేస్తూ లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కళాశాలల యాజమాన్యాలు డోనేషన్ల పేరుతో కోట్లు దోచుకుంటున్నాయని సిఎం చేసిన వ్యాఖ్యలకు యాజమాన్యాలు భయపడి కళాశాలల తెరిచి ఉండవచ్చునని, బకాయిల పేరుతో యాజమాన్యాలు విద్యార్థులు, లెక్చరర్స్, ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. లక్షల మంది లెక్చరర్స్, ఉద్యోగులకు వేతనాలు అందక ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలు ఓపెన్ చేసిన యాజమాన్యాలు మరొక సారి ఫీజుల పేరిట కళాశాలలను మూసివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీ య కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి నాయకులు వంశీకృష్ణ, నందగోపాల్, జగదీష్, వివిధ విశ్వవిద్యాయాల విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నవవిధ భక్తిరస ఆవిష్కృతం-భక్తామృతం నృత్యప్రదర్శన



భక్తామృతం నృత్యప్రదర్శనలో దృశ్యం

**నాంపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త :** శ్రీమద్భాగవత కాలాతీత జ్ఞానం, హిందూ పురాణాల నుండి ప్రసిద్ధ కథలు, పాత్రల ద్వారా తొమ్మిది శాస్త్రీయ మార్గాల నవవిధ భక్తిని కళ్లకు కట్టినట్లు ఆవిష్కృతం చేసింది భక్తామృతం శాస్త్రీయ నృత్యప్రదర్శన. ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాకృతిజ్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శనివారం రాత్రి డా. సుజాత, సుప్రజ సుందరరాజన్ నృత్యదర్శకత్వం, ఎస్.జనకవల్లి నేతృత్వంలో రూపొందించిన నవవిధ భక్తిరూపాలు లక్ష్మీ పాదసేవం; పృథు అర్చన; ప్రహ్లాద స్మరణం; బలిచక్రవర్తి ఆత్మనివేదనము; హనుమాన్ దాస్యం; గోపిక కీర్తనమ్; కళింగ నర్తన శ్రవణం; అక్రూర వందనం; అర్జున సఖ్యంలతో ఈ ప్రదర్శన అద్భుతంగా సాగింది. భగవంతుని సేవలో ఈ తొమ్మిది విధానాల భక్తి యొక్క ప్రతీమార్గం ప్రత్యేకమైనదైనా చివరికి ఒకే పవిత్ర సత్యానికి ఎలా దారితీస్తుందో ఈ భక్తామృతం నృత్య ప్రదర్శన వెల్లడిస్తుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులు ఈ నృత్యప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఓటుకు రేటు కట్టేశారు!

**- నియోజకవర్గంలో మొదలైన డబ్బు పంపిణీ**



**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచిన ప్రధాన రాజకీయ పార్టీలు తాయిళాల పంపిణిని ప్రారంభించాయి. ఇందు కోసం ఓటుకు రేటు కట్టి ఇంటింటికి తిరిగి మరీ పంపకాలు మొదులుపెట్టాయి. ఇప్పటికే రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పలు దఫాలుగా ఇంటింటికి తిరగి ఓటరు వివరాలను, ఓట్ల సంఖ్యను నమోదు చేసుకున్నారు. అందుకు అనుగుణంగా రెండు రోజులుగా డబ్బుల పంపిణీని ప్రారంబించారు. ఇప్పటికే ఒక పార్టీ ఒక్కో ఓటుకు రూ. 3వేలు ఇస్తుండగా, మరో పార్టీ రూ. 1500లు ఇస్తుంది. ఇంకో పార్టీ సైతం డబ్బు పంపిణీకి సిద్దమైంది. డబ్బులే కాకుండా కొందరు బహుమతులను సైతం అందిస్తున్నారు. తమ అభ్యర్థికి ఓటు వేయాలంటూ కోరుతున్నారు. నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, ఎరగ్రడ్డ, సోమాజీగూడ, షేక్‌పేట డివిజన్లలో ఇప్పటికే డబ్బుల పంపిణీ చేపట్టాయి. అయితే డివిజన్‌ల వారీగా, ప్రాంతాల వారీగా కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు రూ. 2 వేలు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 2500, ఇంకొన్ని ప్రాంతాల్లో రూ. 3వేలను ఒక పార్టీ అందిస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు సైతం తమకు వచ్చిన డబ్బులు, ఇతరులకు వచ్చిన డబ్బుల గురించి ఆరా తీస్తున్నారు. మరోవైపు ఇంకో పార్టీ అవతలి పార్టీ ఓటర్లకు సైతం డబ్బులు పంపిణీచేస్తుంది. తద్వారా తమ సంప్రదాయ ఓట్లతోపాటు అవతలి పార్టీ ఓటర్ల ఇంట్లోని ఓట్లలో సగం ఓట్లు తమకు పడుతాయనే ఆలోచనతో డబ్బును అందిస్తున్నారు. ఇదిఇలా ఉండగా కొందరు సంఘాల పేరుతో, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల పేరుతో అభ్యర్థుల ముందు గొంతెమ్మ కొరికలు ఏకరవు పెడుతున్నారు. మరికొందరు ఆధార్ కార్డులు ప్రతులను తీసుకెళ్లి ఓటుకు రేటు కట్టుకొని మరి గంపగుత్తగా డబ్బులు తెచ్చుకొని పంచుతున్నారు. మరికొందరు ఆధార్, ఓటర్ కార్డు ప్రతులతో పలు రాజకీయ పార్టీ అభ్యర్థుల వద్దకు ప్రదక్షణలు చేస్తున్నారు. డబ్బులిస్తేనే మీ వెంట ఉంటామంటూ తేల్చిచెపుతున్నారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు తమ అపార్ట్‌మెంట్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడానికి అవసరమైన డబ్బులను ఇవ్వాలని కోరుతున్నారు. తద్వారా తమ ఓట్లను మొత్తం అదే పార్టీకి వేస్తామనే ప్రతిపాదనలు తీసుకొచ్చారు. డబ్బుల పంపిణీ మొదలు కావడంతో ఇప్పుడు చాలా మంది అభ్యర్థుల కార్యాలయాల వద్ద వారిని కలిసేందుకు పడిగాపులు పడుతున్నారు. ప్రచారం ముగించుకొని వస్తున్న అభ్యర్థులకు వీరు తలనొ ప్పిగా మారుతున్నారు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మొద్దో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

## రేవంత్‌రెడ్డి సైకత శిల్పంతో జన్మదిన వేడుకలు

**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌గార్డెన్స్ సమీపంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముక సైకత శిల్పకారుడు బాలాజీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి సైకత శిల్పాన్ని ఇక్కడ తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిధిగా విచ్చేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రైల్వేగేట్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో సైతం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.




రేవంత్‌రెడ్డి సైకతశిల్పం వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

## అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 8(ప్రభాతవార్త):**
అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాం నగర్ డివిజన్ దయరామర్కెట్ బందన్ ఫంక్షన్ హాల్ నుండి బాకా రం సాగర్ లాల్ హాస్పిటల్ వరకు నూతనంగా సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ను స్థానికుల చే సత్కరించే కార్యక్రమం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నేత ముఠా జై సింహా. డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి. స్థానికులు రహన్ ఖాన్. ఎస్. వెంకటేశ్వర్ రావు. సైదులు. సిల్వర్ వెంకటేష్.రామ్ రెడ్డి. శ్రవణ్. సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్.ముదిగొండ మురళి.గోక నవీన్.ఎర్రం శేఖర్.కొండమడుగు మధు.కళ్యాణ్ నాయక్. జ్ఞానేశ్వర్ గౌడ్.జి.శ్రీనివాస్.గుండు వెంకటేష్.టీవీ.రాజు.మల్లేష్ యాదవ్. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### పంచారామక్షేత్రాల్లో అన్నదానానికి అజయ్‌కుమార్ విరాళం



అన్నదాన పథకానికి 5లక్షల విరాళ చెక్కును అందజేస్తున్న అజయ్‌కుమార్, జ్యోతిరాణి, యశ్వంత్‌రావు తదితరులు

**నాంపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త :**
కార్తీకమాస పుణ్యదినాలను పురస్కరించుకొని పవిత్ర తీర్థాస్థలాలు గా ప్రఖ్యాతిగాంచిన పంచారామ క్షేత్రాలకు విచ్చేసే భక్తులకు అన్నదాన ప్రసాదం పథకం కొనసాగింపుగా ప్రముఖ సామాజికవేత్త, ఆధ్యాత్మిక సేవకులు పుప్పాల అజయ్‌కుమార్ 5లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించి తన ఆధ్యాత్మిక హృదయాన్ని ఆవిష్కరించారు. ప్రఖ్యాత శివాలయాలైన పంచారామ క్షేత్రాలు పల్నాడు జిల్లాలోని అమరారామం, కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం, పశ్చిమ గోదావరి జిల్లాలోని క్షీరారామం, కాకినాడ జిల్లాలోని కుమారారామం, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమారామం ఆలయాలకు విచ్చేసే భక్తులకు భోజనాలు సమకూర్చేందుకు అయ్యే ఖర్చుల్లో తనవంతుగా ఒక్కొక్క క్షేత్రానికి లక్ష రూపాయల చొప్పున విరాళాలు అందజేశారు. ఈమేరకు 5 లక్షల రూపాయల చెక్కును అజయ్ కుమార్ ఆయా క్షేత్రాల పాలకవర్గాలకు అందజేసి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మల్లేపల్లి ఐటిఐ పూర్వ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి, డా. గంట యశ్వంత్‌రావు, దత్తా ప్రసూనలు పాల్గొన్నారు.

### మూడేళ్లుగా అన్నదానం విజయవంతంగా కొనసాగిస్తున్నాం : కొండ విజయ్‌కుమార్



పేదలకు అన్నదానం చేస్తున్న హోప్ ఫౌండేషన్‌చైర్మన్ కొండ విజయ్

**శేరిలింగంపల్లి,నవంబర్ 8 ప్రభాతవార్త**
నిరుపేదల ఆకలిని తీర్చటమే ధ్యేయంగా హోప్ ఫౌండేషన్ ద్వారా మూడేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. చందానగర్ ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నేటితో 157వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ కొండ విజయ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు, అన్నార్తులకు ఆకలితీర్చే క్రమంలో తమ సేవలను కొనసాగిస్తూ వస్తున్నామని, నేటికి మూడేళ్లు పూర్తిచేసుకుని నాలుగవ సంవత్సరానికి అన్నదాన వితరణ జరుగుతుందన్నారు. ప్రతి శనివారం వేలాది మంది పేదలకు, ఆకలిగొన్నవారికి అన్నదాన కార్యక్రమం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. సుమారు 2200మంది పేదలకు అన్నదానం చేయటం జరిగిందని తెలిపారు. . ఈకార్యక్రమంలో హోఫ్ పౌండేషన్ సభ్యురాలు అపర్ణ,బాక్సర్ గిరి, సుధాకర్,వర్ధన్,పలువురు సంఘ సేవకులు పాల్గొన్నారు.

### బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా బిసిలు పనిచేయాలి : రామచందర్ యాదవ్

**బిసి ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్ నియామకం**



బీసీ ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండి రామకృష్ణ గౌడ్

**శేరిలింగంపల్లి,నవంబర్ 8 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర బీసీసంఘాలను ఏకంచేసి,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అద్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ అన్నారు.శేరిలింగంపల్లిలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక ఆద్వర్యంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక భవిష్యత్‌ప్రణాళికలపై సమాలోచనలు జరిగాయి. ఈ సందర్భంగా భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ..బీసీలంతా ఐక్యమై స్థానిక ఎన్నికలు, జీహెచ్ఎంసీ, మునిసిఫల్ ఎన్నికల గురించి సుధీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. బీసీలకు అధికారమే అంతిమ లక్ష్యంగా ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల సహకారంతో బీసీలంతా ఉద్యమించాలని కార్యవర్గసమావేశంలో నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. విద్యా,ఉద్యోగం, ఉపాధి, వైద్యం, పేదరిక నిర్మూనలలో భాగంగా రోటి,కపుడా,మఖాన్ ఉపాధి ద్వారా కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యవర్గసమావేశంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అద్యక్షులు భేరి రామచంద్రయాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న, వనపర్తి జిల్లా గొర్రెల,మేకల పెంపకం దారుల అద్యక్షులు మదుయాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డప్పుకొట్టు హరిబాబు, పాములేటి యాదవ్, సినీ అర్టిస్ట్ లక్ష్మీనారాయణయాదవ్, బీసీకుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తి చాలా పవిత్రమైంది : జస్టిస్ రాజశేఖర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ ఏ రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అవులప్ప డాక్టర్ మాధవి తదితరులున్నారు.

**చిక్కడపల్లి నవంబర్ 8 (ప్రభాతవార్త):**
వైద్య వృత్తి చాలా పవిత్రమైందని తెలంగాణ లోకాయు క్త జస్టిస్ ఏ రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వైద్య నిరక్ష్యం..వినియోగదారుల రక్షణ చట్టం.. 2019 అంశం పై తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్, ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ తెలంగాణ శాఖ, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సు ను జస్టిస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు లోక్ అదాలత్ సభ్యురాలు డాక్టర్ అమితా రాణి, లోకాయుక్త రిజిస్ట్రార్ ఆర్. రఘునాథ్ రెడ్డి, సుప్రసిద్ధ వైద్యులు, మహావీర్ ఆసుపత్రుల పూర్వ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ససనకోట ఆవులప్ప, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు డాక్టర్ మాధవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ లింగయ్య, డాక్టర్ జి.దిలీప్,డాక్టర్ పి.భావన, ఉస్మానియా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తన యాదవ్, తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కేంద్రం డైరెక్టర్ దేవకి తార, ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ స్మిత సోనీ, సీనియర్ ఐటీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ డాక్టర్ సుప్రజ, వినియోగదారుల హక్కుల సంఘం పూర్వ ఛైర్మన్ గౌరీ శంకర్ తదితరులతో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టం

**-దొంగలుగా మారిన దంపతులు**
**-మహిళను వెంబడించి బంగారు చైన్‌ను దొంగిలించిన కేసులో ఇరువురూ అరెస్ట్**



వివరాలు వెల్లడిస్తున్న చిక్కడపల్లి ఏ సి పీ రమేష్ కుమార్, చిత్రంలో చిక్కడపల్లి క్రైమ్ డి ఐ శంకర్, సిఐ రాజు నాయక్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్మ 8 (ప్రభాతవార్త ):**
ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టం కారణం చూపి భార్యా భర్తలిద్దరూ దొంగలుగా మారారు. అవకాశం చిక్కినపుడ్డల్లా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల నుండి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని చిక్కడపల్లి క్రైమ్ పోలీస్ లు అరెస్ట్ చేసారు. శనివారం చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్ ఎల్.రమేష్ కుమార్, స్థానికి క్రైమ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎం.శంకర్, స్థానిక ఇన్స్పెక్టర్ రాజు నాయక్ తో కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కొంగపాడు ప్రాంతానికి చెందిన గుడిపాటి బ్రహ్మయ్య (51 ), గుడిపాటి అంజలి (48) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బోరబండ ప్రాంతంలో ఉంటూ అవకాశం చిక్కినప్పుడల్లా దొంగతనాలకు పాల్పడడం చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో గత నెల 31 న మొదట ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ లో దిగి అక్కడి నుండి నారాయణగూడ మెట్రో స్టేషన్ సుల్తాన్ బజార్ సమీపంలో రెండు దొంగతనాలకు యత్నించారు. ఆ సమయంలో ఎక్కువగా జనసమూహం ఉండడంతో ఫలించలేదు. చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సురేఖ ఔరాద్కర్ (69 ) తాను ఇంటికి తిరిగివస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మొహానికి మాస్కును రామకోటి బస్సు స్టాప్ నుండి చిక్కడపల్లి బస్సు స్టాప్ వరకు వెంబడించి చివరకు తన ఇంటి వద్ద లిఫ్ట్ కోసం వేచి చూస్తున్న తరుణంలో బలవంతంగా బంగారు గొలుసును దోచుకుని పరారయ్యారు. ఫలితంగా తన మెడపై రక్తపు కాట్లు పడ్డాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన క్రైమ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా నవంబర్ 1 వ తేదీన భార్యాభర్తలిద్దరూ దొంగిలించిన సొమ్మును కూకట్ పల్లి మనపురంగోల్డ్ శాఖ లో తాకట్టు పెట్టి రూ.1.13 లక్షల ను తెచ్చుకున్నారు. తాకట్టుపెట్టిన అనంతరం వచ్చిన సొమ్ము లోనుండి తన కుమార్తె వివాహం కోసం చేసిన అప్పును తీర్చారు. చిక్కడపల్లి క్రైమ్ పోలీసులకు పక్క సమాచారం మేరకు శనివారం అశోక్ నగర్ సహారా బేకరి వద్ద చిక్కాడు. అనంతరం విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. సెంట్రల్ జోన్ డిసిపి శిల్పావల్లి , అదనపు డిసిపి బి.ఆనంద్ పర్యవేక్షణలో క్రైమ్ డిఐ శంకర్, సిఐ రాజు నాయక్, ఎస్ ఐ మహమ్మద్ కరీం, క్రైమ్ సిబ్బంది క్రైమ్ కేసును త్వరితంగా ఛేదించడంలో విశేషంగా కృషి చేసారు. క్రైమ్ సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

## మనోరంజకం మిమిక్రీ మ్యాజిక్ మైమ్ కళాప్రదర్శనలు

**-సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

**రవీంద్రభారతి, నవంబరు 8 ప్రభాతవార్త :**
మానసిక ఉల్లాసం, ఆహ్లాదం, ఆనందం, మనోరంజకం నవరసభరితమైన మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళాప్రదర్శనలని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. ఇవి ఎల్లవేళలా అన్నిరకాల ప్రజలను ఆకట్టుకుని అలరించే అరుదైన కళలని ఆయన ప్రశంసించారు. అందుకే వీటికి సంబంధించి ప్రత్యేక డిప్లొమా కోర్సు ను తెలుగు విశ్వవిద్యాలయంలో బోధిస్తున్నట్లు నిత్యానందరావు గుర్తుచేశారు. సమాజహితాన్ని కాంక్షించే ఈ కళలు కళాకారుడి ప్రతిభను చాటడమే కాకుండా వేలాదిమందికి స్వయం ఉపాధికారకాలుగా విరాజిల్లుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిన్నెర 48వ వార్షిక వారోత్సవాల్లో భాగంగా 3రోజుల మాయావినోదం; నాటకోత్సవాల్లో రెండవరోజు శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన మాయావినోదం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య వెలుదండ నిత్యానందరావు గౌరవ అతిథులు ప్రముఖ మూకాభినయ కళాకారుడు జెన్నీ, ఇంద్రజాలకుడు బి.వి.సత్యనగేష్, మిమిక్రీ కళాకారుడు పేరడి గురుస్వామి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి నేటి మాయావినోదంలో అద్భుత ప్రదర్శనలిచ్చిన 21మంది మిమిక్రీ, మేజిక్, మైమ్ కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## విద్యార్థి అమరుల త్యాగం చిరస్మరణీయం : ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కొండా విశ్వేశ్వరరావు

**చిక్కడపల్లి నవంబర్ 8,ప్రభాతవార్త :**
విద్యార్థి అమరుల త్యాగం చిరస్మరణీయం అని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ పిడిఎస్ యు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రొఫెసర్ కొండా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం కోసం, సమాజ మార్పు కై ఉద్యమిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ అమరత్వం పొందిన విద్యార్థి అమరవీరుల త్యాగం చిరస్మరణీయం అని, వారి త్యాగాలతోనే నేటి విద్యా వ్యవస్థలో కొంత మార్పు జరిగిందన్నారు. తరగతి గదిని, సమాజాన్ని వేరు చేస్తూ విద్యార్థుల ను ప్రశ్నించే తత్వం నుండి పాలకులు తప్పిస్తున్నారనీ, ప్రశ్నించే తత్వం లేకపోవడం వలన నేటి విద్యా వ్యవస్థ కార్పొరేట్ల చేత చిక్కి వ్యాపార సరుకుగా మారేందుకు సులవతరం అయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. మానవ విలువలు తగ్గిపోతున్నాయనీ. విద్యారంగం వ్యాపారికరణ వల్ల పేద విద్యార్థులకు చదువు దూరంమవుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థులకు స్కాలర్ షిప్, రియంబర్స్మెంట్ చెల్లించకుండా కమిటీలు వేయడం ప్రభుత్వ ఆధీనంలోనే కొత్త విద్యాసంస్థల్ని నిర్మిస్తామని చెప్పటం వింతగా ఉందన్నారు. కార్పొరేట్ యూనివర్సిటీలకు స్వాగతాలు పలుకుతూ అనుమతులు ఇస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను దెబ్బతీస్తున్నారన్నారు. పాలకులు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, పి.డి.ఎస్.యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్న అప్పారావు, మాజీ రాష్ట్ర నాయకులు పి వరదయ్య, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సాంబ లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ సతీష్, సహాయ కార్యదర్శిలు కే గణేష్, జె గణేష్, కోశాధికారి ఎం సైదులు, రాష్ట్ర నాయకులు వంశీ, సుమన్, విజయ్, రాజు, వినోస్ పాల్గొన్నారు

## నేడు పోటాపోటీగా వాహన ర్యాలీలు

**-పాల్గొననున్న సిఎం రేవంత్‌రెడ్డి, ,మాజీ మంత్రి కెటిఆర్**
**- నేటి నుంచి ఆంక్షలు అమలు**



**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. అక్టోబరు 13న ఎన్నికల అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబరు 13 నుంచి 20 వరకు నామినేషన్లను స్వీకరించారు. 21న స్క్రూటినీ, 23న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతపాటు రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం కలుపుకొని 58 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఆప్ పార్టీ, యుగతులసి, కొబ్బరి చెట్టు గుర్తున్న అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ కనిపించారు. మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు దాదాపుగా ప్రచారంలో పెద్దగా కనిపించలేదు. ప్రచారానికి ఈ నెల 9న తెర పడుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల ఆధ్వర్యంలో నియోజకవర్గం మొత్తం వాహన ర్యాలీలు ఏర్పాటుచేశారు. నవంబరు 11న ఎన్నికల దృష్ట్యా నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ సైతం ఇప్పటికే కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు అయిన 14న జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో ఆంక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. నేటి సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ఆంక్షలు అమలవుతాయని అన్నారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డీఆర్‌సీ కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో ఆంక్షలు ఉంటాయన్నారు. ప్రజలు గుమిగూడి గుంపులుగా ఉండవద్దని, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బద్రతాచర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

## పండుగలు ప్రాచీన సంస్కృతికి ప్రతిబింబాలు

**-కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**



కార్యక్రమంలో పాల్గొన్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి నవంబర్మ 8 (ప్రభాతవార్త ):**
పండుగలు ప్రాచీన సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ నివి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళకు ఉచిత కుట్టు,మగ్గం,బ్యూటిషియన్ పలు అంశాలపై శిక్షణ పొందుతున్న మహిళలు వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎ.పావని వినయ్ కుమార్ పాల్గొని నిర్వాహకులు, మహిళలతో కలిసి భోజనం చేసి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈ దశలో మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ, కార్తీక మాసం వన భోజనం ఏర్పాటు చేయడం శుభ పరినామం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రజీత,సారిక, మంజుల,విద్య, సంగీత,జ్యోతి,ప్రతిమ,టైలరింగ్ టీచర్లు లత , ప్రియాంక ( బ్యూటీషన్), రజిత ( మగ్గం) తో పాటు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేస్తుంది

**- బిఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** కాంగ్రెస్ పార్టీ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేస్తుందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కారుకు ఓటువేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, కార్పొరేటర్లు సామల హేమ, ప్రసన్నలక్ష్మి, లతతో కలిసి ఎర్రగడ్డ డివిజన్ నేతాజీ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తప్పనిసరిగా బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ చెప్పిన వాగ్దానాలను, చేసిన మోసాలను ప్రజలు గుర్తించారన్నారు. ఈ ఎన్నికల్లో అందుకు తగిన తీర్పునిస్తారని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## గోదారంగనాయకస్వామికి ఊంజల్ సేవ, లక్షదీపోత్సవం



దీపోత్స వంలో పాల్గొన్న దంపతులు



ఎదులాబాద్‌లో గోదాదేవికి ఉయ్యాలసేవ

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లో శనివారం సాయంత్రం లక్షదీపోత్సం ఘనంగా జరిగింది. శ్రీగోదాసమేత మన్నార్‌రంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అండాలమ్మకు ఉయ్యాలసేవ/ఉంజిల్ సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మంత్రోచ్చారణాల మధ్య లోకకళ్యాణార్థం, గ్రామ సుబిక్షం కోసం లక్ష దీనోత్సవం నిర్వహించారు. అర్చకుల సూచన మేరకు పలువురు దంపతులు అమ్మవారి మండపం ముందు 365 వత్తుల దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులతో ఆలయ పరిసరాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. అనంతరం భక్తులు ఆలయంలో గోదాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న 66 పశువులు పట్టివేత

**-నలుగురిపై కేసు నమోదు**



పోలీసులు పట్టుకున్న ఆవులు, ఎద్దుల వాహనం

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:** అక్రమంగా ఆవులు, ఎద్దులను కభేళాకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ఘట్‌కేసర్ పోలీసులు బైపాస్‌రహదారి ఎదులాబాద్ రోడ్డు వియూపి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పశువులను తరలిస్తున్న అశోక్‌లేలాండ్ వాహనం (టిఎస్15యుఇ-8156)ను ఆపి పరిశీలించగా 66 పశువులు ఉన్నాయి. వాహనంలో 31 ఆవులు, 35 ఎద్దులు ఉండటంతో విచారణ జరిపి డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యాజమాని అఫ్రోజ్ సూచన మేరకు వీరుముగ్గురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ సమీపంలోని హనుమాన్‌జంక్షన్‌లో పశువుల సంతలో 66 పశువులను కొనుగోలు చేసి వాహనంలో టార్పాలిన్‌తో కప్పి అక్రమంగా తరలిస్తున్నారు. హైదరాబాద్‌లోని బహుదూర్‌పురాలోని జంతువధశాలలో 66 పశువులను వధించడానికి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం షామ్లా జిల్లా ఖొండకాకు చెందిన డ్రైవర్ ఇస్తాకర్ (34)తో పాటు సహాయకులుగా వచ్చిన ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్, రూర్కీకి చెందిన గుల్షన్ (24), ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం సహరాన్‌పూర్, కైలాష్‌పూర్ మహల్లా పీత్వాలాకు చెందిన ఎండి.కలీమ్ (32)లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, ఆవులను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

## ప్రమాద బాధితునికి సన్‌రైజ్ ట్రస్ట్ రూ.20 వేలు ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన యువకుడికి ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీకి చెందిన శివరాత్రి బాలాజీ (16) వారం రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురయ్యాడు. బాలాజీ ముక్కు, ముఖం, కాళ్లకు తీవ్రగాయాలు కాగా ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. బాలాజీ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోగా తండ్రి అనారోగ్యంతో ఏమి చేయలేక ఇంట్లోనే ఉంటుండగా తల్లి కూలీ పనికి వెళ్తున్నది. ఆసుపత్రి ఖర్చులు భరించేస్తోమత లేకపోవడంతో ఆర్థికసాయం కోసం సన్‌రైజ్ ట్రస్ట్ సభ్యులు ఎ.వీరారెడ్డిని ఆశ్రయించారు. పేదకుటుంబం కావడంతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం శనివారం ట్రస్ట్ ద్వారా రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో వై.సుందర్‌రావు, ఎ.వీరారెడ్డి, ఎం.శరబంధ, డి.ఐలయ్య, ఎన్.రామయ్య, ఎం.దేవానంద్, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సినీ కార్మికుల ప్రయోజనానికి సిఎం కృషి

**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిలింఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనీల్‌కుమార్, తెలుగు ప్రొడోన్ మేనేజర్ యూనియన్ కార్యదర్శి, తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి కానుమిల్లి అమ్మిరాజు, తెలుగు సినిమా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కోశాధికారి శ్రీకాంత్, ఫిలించాంబర్‌కు చెందిన భూషణ్, మాటల రచయిత పరుచూరి గోపాలకృష్ణలతో కలిసి కేక్‌ను కట్ చేశారు. సినీ కార్మికుల ప్రయోజనానికి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వల్లభనేని అనీల్‌కుమార్ అన్నారు. ఆయన మాట ఇస్తే తప్పకుండా చేసి తీరుతారన్నారు. ఈ కారణంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాము రేవంత్‌రెడ్డికి మద్దతు పలికామని అన్నారు. కార్యక్రమంలో చిత్రపురి కమిటీ సభ్యులు బత్తుల రఘు, టి. లలిత, వేణుగోపాల్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 16న బాసర ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో ప్రత్యేక పూజలు, నృత్యకళార్చన

**నేరేడ్‌మెట్, నవంబర్ 8, ప్రభాతవార్త :**
చదువుల తల్లి బాసర మహాసరస్వతి ఆలయం సమీపంలోని శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి స్థాపించిన సిద్ధాశ్రమం కోటి పార్థివ లింగస్థాప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో ఈ నెల 16న మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికానాథ శర్మ, సంధ్య దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా కలశస్థాపన, విఘ్నేశ్వర పూజ, మహారుద్రాభిషేకం, గోపూజ, రుద్ర, గణపతి, నవగ్రహ, సరస్వతి, మేధా దక్షిణామూర్తి హోమాలు నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సులోచన కళాక్షేత్రం, సాయి నటరాజ అకాడమీ నృత్య విద్యార్థులచే నృత్యకళార్చన జరుగనుంది. నాట్య గురువులకు ఉత్తమ సాంస్కృతిక నాట్య సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలు, నృత్యకళార్చన ఉచితంగా నిర్వహించబడతాయని, ఆసక్తి గల భక్తులు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి 99483 32032ను సంప్రదించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

## వనస్థలిపురం డివిజన్ బిజెపి మహిళా, కిసాన్, ఎస్టీ మోర్చా అధ్యక్షుల నియామకం



మాధవి, శ్రీనివాస్ రెడ్డి, చందర్ నాయక్‌లకు నియామకపు పత్రాలను అందజేస్తున్న క్రాంతిగౌడ్ తదితరులు.

**వనస్థలిపురం. 8 నవంబర్ ప్రభాతవార్త:**
వనస్థలిపురం డివిజన్ బి.జె.పి. మహిళా మోర్చా, కిసాన్ మోర్చా, ఎస్.టి. మోర్చా అధ్యక్షులను డివిజన్ బి.జె.పి. అధ్యక్షుడు కాటం క్రాంతిగౌడ్ నియమించారు. వనస్థలిపురం డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కాంప్లెక్స్ లో నివాసముండే ఏ.మాధవి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గా వెంకటరమణ కాలనీలో నివాసముండే దేప శ్రీనివాస్ రెడ్డి ,ఎస్.టి. మోర్చా అధ్యక్షుడు గా రైతుబజార్ సమీపంలో ని డబల్ బెడ్ రూమ్ లలో నివాసముండే చందర్ నాయక్ లను నియమిస్తూ క్రాంతిగౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. అట్టి నియామకపు పత్రాలను సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, కొత్త రవిందర్ గౌడ్, నాయిని శ్రీకాంత్ రెడ్డి ల చేతుల మీదుగా అందుకున్నారు. సీనియర్ నాయకుల సలహాలు, సూచలనతో పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు, పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ,అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిపోలు రవి కుమార్, అరుణ్ జోగి, అభినందన గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని న్యూ పవన్‌పురి కాలనీ నుండి చంద్రయ్య హట్స్ వాంబే క్వార్టర్స్ వరకు రూ.9.76లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నిర్ధేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్ రెడ్డి, సుధాకర్‌రావు, వెంకటేష్‌గౌడ్, సంగమేశ్వర్, నర్సింహా, విజయ్, ఈశ్వరయ్య, పెంటయ్య, ముఖేష్, రామారావు, మారుతి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రఘుమారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిషికాంత్‌రెడ్డి, గూడూరు గౌతమ్ రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యాదగిరి, సురేష్‌రెడ్డి, నితీష్, శివ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం : సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న అనంతరం జితేందర్ మాట్లాడుతూ ఎర్రగడ్డ డివిజన్‌లో రూ. 9.33కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, డివిజన్‌లో 35 వేల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. హైద్రాబాద్ మెట్రోరైలు, ఫ్లై ఓవర్‌లు, పార్కులు, ఐటి, ఫార్మా, ఎయిర్‌పోర్టు వంటివి అన్ని కాంగ్రెస్ హయాంలోనే రావడం జరిగిందన్నారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని గుర్తించి హస్తం గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



.స్వామీ వారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**హుడా కాంప్లెక్, 8 నవంబర్ ప్రభాతవార్త:**
సరూర్‌నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో 41వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల లక్ష్మణ చారి, వంశీదరా చార్యులు, రామ కృష్ణమా చార్యులు, ఎస్. శ్యాం సుందర్ ల వేదొచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి విచ్చేసి అనుగ్రహ భాషణతో అనుగ్రహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్య లో ఆలయానికి విచ్చేశారు. దేవాలయ ప్రాంగణం మొత్తం భగవన్నామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు కాలనీ అసోసియేషన్ అధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు, ఆలయ మాజీ చైర్మన్ గందు ధనం రెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి మడకశిర శాంతి ప్రసాద్, కోశాధికారి మురళీ కౌండిన్య, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, శ్రీమన్నారాయణ, బొగేశ్వర్ రావు, సుబ్బారావు, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, సుధాకర చారి, నరేష్ , యాదగిరి రెడ్డి, ఎం.ఎన్.రావు, పి వి ఎస్ ప్రసాద్, సాయి కృష్ణ, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస చారీ , కోశాధికారి సాయికిరణ్, కృష్ణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు

## బస్సు డ్రైవర్ పై ఇద్దరి యువకుల దాడి ..డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**
గుర్తు తెలియని ఇద్దరు యువకులు బస్సును అడ్డగించి డ్రైవర్ పై దాడి చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి కొత్తపేట విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ 1632 సమీపంలో దాడి జరిగింది. ఎస్విటి ప్రైవేట్ ట్రావెల్స్ బస్ నంబర్ ఎన్ఎల్-01-బి-9333 గల దాని డ్రైవర్ షేక్ మస్తాన్, బస్ క్లీనర్ కళ్ళూరి వెంకటనారాయణతో పాటు 43 మంది ప్రయాణికులతో హైదరాబాద్ బీరంగూడ నుండి పామూరుకు వెళ్తున్నారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి మార్గ మధ్యలో కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ మెట్రో పిల్లర్ నంబర్ 1632 వద్ద యు టర్న్ దగ్గర ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ పై రాంగ్ రూట్ లో బస్సుకు ఎదురుగా వాహనం నిలిపారు. బస్సు డ్రైవర్ తో ఏమిరా బస్సు ఎట్ల నడుపుతున్నావని దుర్భాషలాడడంతో పాటు బస్సును అడ్డగించి రోడ్డుపై ఆపి డ్రైవర్ తో గొడవ పడ్డారు. తిరిగి వెళ్ళుతూ రాయితో దాడిచేయగా బస్సు ముందు అద్దము పగిలి గాజు ముక్కలు డ్రైవర్ కు తగిలి చిన్న గాయాలు అయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి చైతన్యపురి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నారు.

## మెగాసిటీ గ్రామర్ హై స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గాయత్రీనగర్‌లో నున్న మెగాసిటీ గ్రామర్ హై స్కూల్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వాసన కంటి ఆసుపత్రి, మెగాసిటీ గ్రామర్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక కాలనీవాసులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి నేత్ర వైద్య నిపుణులు, సిబ్బంది అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలను నిర్వహించి సమస్యలు ఉన్న వారిని గుర్తించారు. కంటి లోపల శుక్లాలు ఉన్న వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన చికిత్సల కోసం సూచనలు, సలహాలు అందజేశారు. అదే విధంగా ఐడ్రాప్స్, కంటి అద్దాలు అవసరమున్న వారిని కూడా గుర్తించి కంటి లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప పాఠశాల కరస్పాండెంట్ కె.సంధ్యామూర్తి, డైరెక్టర్ కెవిఆర్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కళ్ళను కాపాడుకోవాలి: మెగాసిటీ డైరెక్టర్ మూర్తి**
సర్వేంద్రియానాం నయనం ప్రదానం అనే సూక్తిని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ కళ్ళను కాపాడుకోవాలని మెగాసిటీ గ్రామర్ స్కూల్ డైరెక్టర్ కెవిఆర్ మూర్తి అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దనీ సకాలంలో చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు. నేడు కంటి వైద్య చికిత్సల్లో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయనీ వాటిని అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.




మెగాసిటీ గ్రామర్ హై స్కూల్ ఉచిత వైద్య పరీక్షలు జరిపించుకుంటున్న వృద్ధులు, మహిళలు,

## రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దయానంద గుప్తా, విజయరంగ

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**
రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వాళ్ళం అవుతామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారంకొత్తపేట న్యూమారుతీనగర్ మహిళ భవనంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బొగ్గారాపు దయానంద్ గుప్తా, లైన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళకు విజయ రంగ, నిమ్మగడ్డ ఆశ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, తిరుమల రెడ్డి, బొగ్గారపు వరుణ్ చంద్ర, బొగ్గారాపు శరత్ చంద్ర, ఆశ నిమ్మగడ్డ తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి సిఎం కృషి: మల్లారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, 24వ డివిజన్ అల్మాస్‌గూడ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి అన్నారు. శనివారం అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేకు కట్ చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు, పేదలకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా ఉద్యోగ నియామకాలు చేస్తూ నిరుద్యోగ సమస్యను తీరుస్తున్నారని మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి వంశీ, లక్ష్మయ్యగౌడ్, నర్సింహగౌడ్, లగ్గాల మధు, సత్తిరెడ్డి, కిశోర్, తిరుపాల్, చంద్రం పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒక వ్యక్తి మృతి

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాలీ కింద పడుకున్న ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ కెసిఆర్‌కు చెందిన వి.శేఖర్ (40) క్యాటరింగ్ పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం అదే ప్రాంతంలో జరిగిన ఒక క్యాటరింగ్ పంక్షన్‌కు హాజరై స్థానికంగా ఉన్న బార్‌లో మద్యం సేవించి నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్నాడని తెలిపారు. ఉదయం ట్రాక్టర్‌ను బయటకు తీసేందుకు వెళ్లి డ్రైవర్ గమనించకుండా ముందుకు వెళ్లడంతో కింద పడుకున్న శేఖర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బోడుప్పల్‌లో గోపినాథ్ వర్ధంతి



స్వర్గీయ బొమ్మ గోపినాథ్ ఎనిమిదో వర్ధంతి నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ అజయ్ యాదవ్ , పోగుల నరసింహారెడ్డి, బొమ్మక్ కళ్యాణ్ తదితరులు

**బోడుప్పల్, నవంబర్ 8 ప్రభాతవార్త :**
బోడుప్పల్ మాజీ ఉప సర్పంచ్ బొమ్మక్ గోపినాథ్ ఎనిమిదవ వర్ధంతి వేడుకలు శనివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఆయన కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మా రెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్ పాల్గొని గోపినాథ్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ ... బొమ్మక్ గోపినాథ్ ప్రజల మన్ననలు పొందిన మహా నాయకుడని, ఆయన సేవా తపన యువతకు ఆదర్శమని స్మరించారు. గోపినాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, చీరాల నర్సింహ్మా, భూక్య సుమన్ నాయక్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొమ్మక్ విశ్వనాథ్, కీసర దేవస్థానం సభ్యులు రాపోలు శంకరయ్య, బోడుప్పల్ నగర ప్రధాన కార్యదర్శి గందే విశ్వం గుప్తా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్, పక్కీర్ హరినాథ్ రెడ్డి, పొద్దుటూరి వెంకటేష్ గుప్తా, రాపోలు రామస్వామి, జ్ఞానేశ్వర్, పడతం లోకేష్, చీరాల జంగయ్య, గోపు రాము, సింగిరెడ్డి రాజురెడ్డి, తోటకూర రాజు యాదవ్, బోడుప్పల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందుకూరి నవన్ ,శివ యాదవ్, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దుల శ్రీకాంత్ యాదవ్ , కాంగ్రెస్ యూత్ నాయకులు ,బొమ్మక్ నిఖిల్, పాల్గొన్నారు.



**సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి యూనిటీ మార్చ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కుష్బూ గుప్త, చిత్రంలో జిల్లా కన్వీనర్ అనంత్ కృష్ణ, కో కన్వీనర్ యాదగిరి తదితరులు (మలక్ పేట ,ప్రభాతవార్త)**

## శ్రీ భవతి క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కీసరలోని శ్రీ భవతి క్షేత్రాన్ని సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** కీసర మండలం, గోదుమకుంటలోని ఓమోజయా శ్రీ భవతి క్షేత్రాన్ని శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా ఆధ్యాత్మిక సాధన, గురుభక్తి, కలయిక, సేవా భావాలు ఈ సంస్థలో ఉంటాయని తెలిపారు. భక్తులు మంగళకార్యాలు, కీర్తనలు, సమూహ భజనలు నిర్వహిస్తారని తెలిపారు. క్షేత్ర సమీపంలో సామూహిక సేవా కార్యక్రమాలు (ఉచిత భోజనం, సంకల్ప సేవ) ఉంటాయని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమాయూజాయా శ్రీపరామోజి బ్రహ్మ శాస్త్రజ్ఞ శ్రిరుషి ప్రజ్ఞానంద స్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమసాయినగర్‌లో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :**
ఉప్పల్ డివిజన్ పరిధిలోని హనుమసాయినగర్‌లో గత రెండు నెలల నుంచి పగటి వేళ వీధిదీపాలు వెలుగుతున్నాయని, దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక నేత బజారు హరి కృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప్పల్ హనుమసాయినగర్ కాలనీలో గత రెండు నెలల నుంచి వీధిదీపాలు వెలుగుతున్నాయని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ వృధా కావడంతోపాటు, విద్యుత్ బిల్లులు కూడా జిహెచ్ఎంసిపై పడే అవకాశం ఉందన్నారు. విద్యుత్ స్థంభాలకు ఉన్న వైర్లు తొలగించాని, కేబుల్ వైర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. దీనిపై జిహెచ్ఎంసి అధికారులను వివరణ కోరగా సర్కిల్ పరిధిలో వీధిదీపాల టైమర్లు పనిచేయడం లేదని, ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.



ఉప్పల్ హనుమసాయినగర్‌లో పగలు వెలుగుతున్న వీధిదీపాలు దృశ్యం.

## బిసి నినాదాన్ని ప్రజలల్లోకి తీసుకెళ్లాలి : ఆర్.కృష్ణయ్య



ఉప్పల్‌లో జరిగిన బిసి సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, గుజ్జ రమేష్, బిఎస్ రాములు తదితరులు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** బిసిలు అర్థికంగా, సామాజికంగా రాణించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లో తెలంగాణ బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి గుజ్జ రమేష్ ఆధ్వర్యంలో మేమెంతో మాకంత బిసి నినాదం పేరుతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్యతోపాటు, బిసి కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, వి.ప్రకాష్, సర్ధార్ పాపన్నసేన అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్, శ్రవణ్‌గౌడ్, భుజంగరావు, పురుషోత్తమ్‌రావు, విధాత సిఇఒ తేజశ్రీ పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిసిలు తమ హక్కుల సాధన కోసం పోరాటం ఉధృతం చేయాలన్నారు. బిసిలు ఐక్యంగా ఉండి తమ సమస్యలు సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిఆర్ సంస్థ మొదటి వార్షికోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## హోమియోపతి ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



రామంతాపూర్ హోమియోపతి ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ తదితరులు

**రామంతాపూర్, నవంబరు 8 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రామంతాపూర్ హోమియోపతి ఆసుపత్రిలో యువజన కాంగ్రెష్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల సాధన కోసం తన వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిషోర్, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్, గుమ్ముల భాను, పాషా, భాస్కర్, సుమిత్, తరుణ్ పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :**
ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం నృత్యనంది స్కూల్ అఫ్ డాన్స్ నాట్య గురువు ఉమా రెడ్డి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా మహా గణపతిమ్, మూషిక వాహన, ఏకదంతాయ వక్రతుండాయ, రామచంద్రయ్య, భో శంభో, శ్లోకం, బ్రహ్మాంజలి, రారా వేణుగోపాల, కొలువైతివారంగా సాయి, స్వాగతం కృష్ణ, గరుడ గమన తదితర అంశాలను కళాకారులు ఆధ్య, ఆరాధ్య, గీతికా, హంసిని, హర్ష, హర్షిక, లాస్య, కృతిక, నేహన , ప్రజ్ఞ శ్రీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.